పాలేరుకు సేవ చేస్తా : ఎమ్మెల్యే పొంగులేటి

కూసుమంచి, డిసెంబర్ 4: పాలేరు నియోజవకర్గ ఎన్నికల ఫలితాలపై గెలుపొందిన ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్ రెడ్డి స్పందించారు. పాలేరు ప్రజలకు సేవకుడిగా ఉంటానని ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరులో ప్రజలు తనపై కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకానికి సేవకుడిగా పని చేస్తానని, ప్రజలు ఇచ్చిన తీర్పు తన జన్మలో మరిచిపోలేనన్నారు.

పాలేరు ప్రజలకు కృతజ్ఞతలు : కందాళ ఉపేందర్‌రెడ్డి

పాలేరు నియోజకవర్గంలోని ప్రజలకు కృతజ్ఞతలు. తనపై అభిమానంతో ఓట్లు వేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. గెలుపొందిన పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం : కమల్‌రాజు

మధిర, డిసెంబర్ 4: మధిర నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. సోమవారం ఆయన నమస్తేతో మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గ అభివృద్ధి కోసం నా వెన్నంటే ఉండి సహాయ సహకారాలు అందించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు కృషి చేశారని అన్నారు. నా గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసి కారు గుర్తుపై ఓటేసి అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవులతో నిమిత్తం కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, అలాగే అన్నింట మీకు చేయూతనిస్తూ మీ మధ్యనే ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గత రెండు నెలలుగా అసెంబ్లీ ఎన్నికల కోసం గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఎంతో శ్రమించి నాకు అండగా నిలిచిన పార్టీ శ్రేణులందరికీ రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో సహకరించిన ప్రజలు, అభిమానులు, అన్ని వ్యాపారరంగాల వారికి, అన్ని వర్గాల వారికి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు

ఎర్రుపాలెం, డిసెంబర్ 4: కార్యకర్తలకు అన్ని వేళలా అండుబాటులో ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజుకు ఓట్లు వేసిన ప్రతిఒక్కరికీ, కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలందరూ మనోధైర్యంతో ఉండి పార్టీని కాపాడుకుందామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులందరికీ పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీటీసీలు మస్తాన్‌వలీ, కిశోర్‌బాబు, నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, పులి శిరీష, సరోజిని, పుల్లారెడ్డి, రవి, వీసం శ్రీను, తిరుపతిరావు, హుస్సేన్, ఎస్.కే.బాబ్జి, బాలరాజు, డీవీఆర్, యాకోబు, చిన్నవెంకయ్య, వెంకటేశ్వర్లు, దానయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తాం..

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న

తిరుమలాయపాలెం, డిసెంబర్ 4: పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డికి ఓట్లు వేసిన ప్రజలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కందాళను గెలిపించేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గెలుపోటములు సహజమని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల వెన్నంటే ఉంటూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

9 మందిపై కేసు నమోదు

చింతకాని, డిసెంబర్ 4: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన 9 మందిపై సోమవారం కేసు నమోదైంది. ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వేర్వేరుగా జరిగిన మూడు ఘటనల్లో ఎం హనుమంతరావు, బీ వెంకయ్య, నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్సై అదే గ్రామానికి చెందిన 9 మందిపై కేసు నమోదు చేశారు. ఊరేగింపుల్లో జరిగిన గోడవల కారణంగా మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

చింతకాని, డిసెంబర్ 4: పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతిపై పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సోమవారం అన్నారు. మండల పరిధిలోని వందనం ప్రాథమిక పాఠశాల, కొదుమూరు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొదుమూరు ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులను కలిసి పలు ప్రశ్నలను వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం గణిత అంశాలు బోధించి విద్యార్థుల ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసిన అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. 100శాతం ఉత్తీర్ణత సాధించాలని, కష్టమైన సబ్జెక్టునే ఇష్టంగా మలచుకోవాలని సూచించారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రానున్న రోజుల్లో ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మన ఊరు మనబడిలో భాగంగా నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. వందనం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును విద్యార్థుల ద్వారా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు, హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు బత్తుల తిరపయ్య, నిర్మల పాల్గొన్నారు.

భయాందోళనలో రైతులు

పంటను కాపాడుకునేందుకు చర్యలు

పంటలపై మిచౌంగ్ తుపాన్ పడగ

వర్షానికి పట్టాలు కప్పిన రైతులు

వర్షంలో కూరగాయలు కొంటున్న ప్రజలు

కూసుమంచి, డిసెంబర్ 4: మిచౌంగ్ తుఫాన్ వల్ల వరి కోతలకు ఇబ్బంది కలిగింది. ఇప్పటికే కోతలు పూర్తయిన రైతులు ధాన్యం ఆరబెట్టుకొంటుండగా మిగిలిన రైతులు కోతలు కోస్తున్నారు. తుఫాన్ హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. పట్టాలు కప్పి కాపాడుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని కూసుమంచి, కిష్టాపురం, పోచారం, జీళ్లచెరువు, జుర్రుల్‌రావుపేట, వంటి ప్రాంతాలతోపాటు నేలకొండపల్లి మండలంలో పలు ప్రాంతాల్లో ఇంకా వరి కోతలు అవుతున్నాయి. తుఫాన్‌తో పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటికే పంటలు ఇంటికి చేరిన రైతులు వాటిపై పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకొంటున్నారు.

ముదిగొండ, డిసెంబర్ 4: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో మండలంలో కురిసిన ఆకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయానికి వర్షం కరుస్తుండడం ఆందోళనకు గురిచేస్తుంది. మండలంలో వరి, పత్తి, మిరప ప్రధానంగా సాగు చేస్తుండగా వర్షం ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయని ప్రజలు ఆందోళన పడుతున్నారు. కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పుతున్నారు. ప్రస్తుతానికి వర్షం సాధారణంగానే కురుస్తున్నా భారీ వర్షం కురిస్తే పంట నష్టం అధికంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుంది

తిరుమలాయపాలెం, డిసెంబర్ 4: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని మండల జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు అన్నారు. తిరుమలాయపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, పాలేరులో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించిన మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జోగులపాగు సర్పంచ్ నల్లబెల్లి లింగయ్య, నాయకులు బోళ్ల లింగయ్య, బోడ సుదర్శన్, ఊడుగు కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

చుంచుపల్లి, డిసెంబర్ 4: మీచౌంగ్ తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి జిల్లాలో రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు కూడా 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్మ, జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం.సుమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

రామవరం, డిసెంబర్ 4: బేస్‌మెంట్ కుంగిపోతుందనే సాకుతో ఓ వ్యక్తి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని సింగరేణి ఎస్అండ్‌పీసీ, పర్సనల్, ఎస్టేట్ సిబ్బంది కూల్చివేశారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ జడ్పీ స్కూల్ వద్ద ఓ దుకాణదారుడు బేస్‌మెంట్ సాకుతో అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. సింగరేణి అధికారులు విషయం తెలుసుకున్న అక్కడికి చేరుకున్నారు. పరిశీలించిన అనంతరం అది అక్రమ నిర్మాణమని తేల్చి పనులను నిలిపివేయించి కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కూనంనేనికి సన్మానం

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 4: తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులు సోమవారం కొత్తగూడెంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిశారు. ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు వీ.శాంతిరాం ఆధ్వర్యంలో ఉద్యమకారులంతా వెళ్లి కూనంనేనిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. చింతలచెర్వు గెర్షోమ్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సారయ్య, కనకయ్య, ఎండీ సత్తార్, వందనపు సూర్య ప్రకాశరావు, గౌతంచంద్ పారక్, ఎండీ వజీమ్, సోలాపురి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అల్పాహారం

సత్తుపల్లి, డిసెంబర్ 4 : సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా 155వ రోజు సోమవారం పట్టణంలో నిరుపేదలకు అల్పాహారం అందించారు. పట్టణానికి చెందిన పసుమర్తి నరేశ్, ప్రేమాన్విత వివాహ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని లయన్స్ బాధ్యులు దారా కృష్ణారావు, దొడ్డా కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్, ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు ప్రతిరోజూ ఉదయం 8గంటలకు 200 మందికి పైగా అల్పాహారం అందిస్తున్నారు. 155 రోజులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. లయన్స్ బాధ్యులు జంగాల సత్యనారాయణ, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, గంధ్ర సోమిరెడ్డి, కొత్తూరు సత్యనారాయణ, వెల్ది జగన్మోహనరావు పాల్గొన్నారు.

మహనీయుల జీవితచరిత్ర చదవాలి

పెనుబల్లి, డిసెంబర్ 4 : విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితంకాకుండా మహనీయుల జీవిత చరిత్రలు చదవడం చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని వ్యాస రచయిత ఎం.రాంప్రదీప్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముత్తగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు కే.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బోధనలో మార్పులను అందిపుచ్చుకోవాలి'

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 4: బోధనలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ సూచించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ విధులకు ఆటంకం.. కేసు నమోదు

రఘునాథపాలెం, డిసెంబర్ 4: మహిళా పోలీసు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. పంగిడి గ్రామానికి చెందిన బానోత్ చందర్ సోమవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన బైక్‌ను స్టేషన్ ఎదురుగా పార్క్ చేశాడు. గమనించిన మహిళా కానిస్టేబుల్.. బైక్‌ను పార్కింగ్ ప్రదేశంలో పెట్టాలని సూచించింది. దీంతో అతడు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు చందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అయ్యప్ప మాలధారుల పూజలు

కారేపల్లి, డిసెంబర్ 4 : మండలవ్యాప్తంగా వందలాది మంది భక్తులు అయ్యప్పస్వామి మాల ధరించి స్థానిక దేవాలయాల్లో పీఠాలు ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో గురుస్వాములు గొడుగు శ్రీను, కేసగాని బాలకృష్ణ ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేశారు.